క్లుప్తంగా

ఇంధనం పొదుపు ఎంతో అవసరం

శ్రీశైలంప్రాజెక్ట్: ఇంధనం పొదుపు చేయడం ఎంతో అవసరమని అధ్యాపకులు కె.రాజన్న అన్నారు. శనివారం బోర్డు ఫర్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ త్రూ ఎడ్యుకేషన్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంధనం పొదుపుపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. ఆధునిక యుగంలో విద్యుత్ అవసరం ఎంతో ఉందని, విద్యుత్‌తో పాటు ఇతర ఇంధన వనరులను కూడా పరిమితంగా , పొదుపుగా వాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.హుస్సేన్‌బాషా, అధ్యాపకులు శివనాగిరెడ్డి ఉన్నారు. బీఎస్సీ విద్యార్థిని ఎస్ యాశ్విన్ విద్యుత్ పొదుపుపై ఇచ్చిన ప్రదర్శన అందరికిని ఆకట్టుకుంది.

గిరిజనులకు దుప్పట్ల పంపిణీ

మహానంది: మహానంది సమీపంలోని తెలుగుగంగ కట్ట వద్ద ఉన్న పేద గిరిజనులకు శనివారం దుప్పట్లను పంపిణీ చేసినట్లు హర్‌సెల్ఫ్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ రాజశేఖర్ తెలిపారు. నంద్యాలలోని చిన్నపిల్లల నిపుణులు డాక్టర్ తారకేశ్వరరెడ్డి దంపతుల సహకారంతో 52 కుటుంబాల వారికి దుప్పట్లు అందించామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జనార్దన్‌శెట్టి, తిమ్మాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి చంద్రశేఖర్, వీఆర్‌ఓ శివప్రసాద్ సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ఆత్మకూరు: మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమ్యలను పరిష్కరించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు అంకిత భావంతో విధులు నిర్వహిస్తున్నారని, అయితే వీరికి ప్రభుత్వం వేతనాలు పెంచకపోవడం సరికాదన్నారు. మున్సిపల్ కార్మికులకు ఈపీఎఫ్ జమ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం ప్రతాప్, నాగరాజు, బాబు, శేఖర్, దివాకర్‌రావు, అంబయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూకు ఇద్దరు హాజరు

పగిడ్యాల: లక్ష్మాపురం సచివాలయం–1 పరిధిలో వలంటీర్ నియామకం కోసం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం చేపట్టిన ఇంటర్వ్యూకు ఇద్దరు అభ్యర్థులు హాజరైనట్లు ఎంపీడీఓ వెంకటరమణ తెలిపారు. ఈ పోస్టుకు ఆన్‌లైన్‌లో ముగ్గురు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా.. కేవలం ఇద్దరు మాత్రమే హాజరయ్యారని చెప్పారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ పుల్లయ్య, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

వాహనాల వేలం

జూపాడుబంగ్లా: అక్రమ మద్యం రవాణా చేస్తూ పట్టుబడిన ద్విచక్రవాహనాలను సెబ్ డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు ఈనెల 31న బహిరంగ వేలం వేయనున్నట్లు నందికొట్కూరు పట్టణ సెబ్ సీఐ రమేష్‌రెడ్డి శనివారం తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 30వ తేదీ ఉదయం నుంచే రూ.3వేల ధరావత్తు, ఆధార్‌కార్డు జిరాక్సు ఇచ్చి సాయంత్రం 4గంటల నుంచి ఎంట్రీ పాసు పొందవచ్చన్నారు. ఎంట్రీ పాసులు 31వ తేదీ ఉదయం 9.30గంటల్లోగా పొందాలని, ఆ తర్వాత పాసులు ఇవ్వరని స్పష్టం చేశారు. వేలంలో వాహనాలను దక్కించుకున్న వారు వేలం మొత్తంతో పాటు జీఎస్టీని నిర్ణీత సమయంలోగా చెల్లించి వాహనం తీసుకెళ్లాల్సి ఉంటుందన్నారు.

ఆత్మకూరు: పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో ఈ నెల 31న వాహనాల వేలం నిర్వహిస్తున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ నాయుడు తెలిపారు. ఆత్మకూరు డివిజన్ పరిధిలో అన్ని మండలాల్లో నాటుసారా, మద్యం కేసులకు సంబంధించి జప్తు చేసిన వివిధ వాహనాలను వేలం వేస్తున్నట్లు చెప్పారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



మహబూబ్‌బాషా

ఆత్మకూరు: జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాల విద్యార్థి ఎస్‌కే మహబూబాషా ఎంపికైనట్లు జిల్లా ఖోఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్న మహబూబ్‌బాషా రాష్ట్ర జట్టుకు ఎంపిక కావడం హర్షించదగ్గ విషయం అన్నారు. ఖోఖో పోటీల్లో రాణిస్తున్న విద్యార్థిని ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ గోపాల్

ఆత్మకూరు: చెంచుగిరిజన గూడేల్లోని చెంచుగిరిజనులు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వైద్యపరీక్షలు సక్రమంగా నిర్వహించుకోవాలని బైర్లూటి వైద్యాధికారులు గోపాల్, పవన్‌కుమార్ సూచించారు. మండలంలోని అమలాపురం చెంచుగూడెంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గిరిజన మహిళలు, గర్భిణులు, బాలింతలు రక్తహీనతతో ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వీరికి ప్రతి రోజూ పౌష్టికాహారం అందించాలని సూచించారు. చిన్నారులు, బాలింతలు, గర్భిణులు, మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రవణమ్మ, మహేశ్వరమ్మ, రజిత, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'గడప గడపకు'

- ఎమ్మెల్యే తొగురు ఆర్థర్
- ప్రతి ఇంటికీ వెళ్లి సమస్యలు తెలుసుకోవాలని వలంటీర్లకు ఆదేశం
- నుంకేసులలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



మహిళకు బుక్‌లెట్‌ను అందజేసి పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్



అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే

మిడుతూరు: ప్రజా సమస్యల పరిష్కారానికే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. వలంటీర్లు పదే పదే చెప్పించుకోకుండా నిర్లక్ష్యం వీడి మీ పరిధిలో ఉండే ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకొని ఎప్పటికప్పుడు పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. శనివారం మండల పరిధిలోని నుంకేసుల గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యే మొదట జాతిపిత మహాత్మా గాంధీజీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ప్రభుత్వ భూముల కబ్జాపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు

గ్రామంలో ప్రభుత్వ భూముల విస్తీర్ణం అధికంగా ఉందని, గతంలో అసైన్డ్ కమిటీ ద్వారా ఇచ్చిన రికార్డులను తారుమారు చేసి, నకిలీ పాస్ పుస్తకాలను సృష్టించి యథేచ్ఛగా భూములను కబ్జా చేస్తున్నారని గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎమ్మెల్యే ప్రస్తుతం జరుగుతున్న భూ– సర్వేలో పారదర్శకంగా చేపట్టి, అక్రమాలకు, కబ్జాలకు గురైన భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకునేలా చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ఇంకా డ్రైనేజీలు, పింఛన్లు, ప్రభుత్వ స్థలాలు, గృహాలు తరిదత సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

ప్రతి ఇంట సంక్షేమ వెలుగులు

అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. గ్రామీణులకు అందుబాటులో ఉండేలా సచివాలయం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ క్లీనిక్ కేంద్రాలు ఏర్పాటుచేసి ఇంటిముంగిటకే సేవలు అందజేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి చెరుకుచెర్ల రఘురామయ్య, రాష్ట్ర ఉర్దూ అకాడమి డైరెక్టర్ అబ్దుల్ షుకూర్, కిసాన్ సంఘ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వంగాల సిద్దారెడ్డి, ఎంపీడీఓ జీఎన్ఎస్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ రవణమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు సల్కోటి గోవర్దన్‌రెడ్డి, తువ్వా అయ్యపురెడ్డి, పుల్లయ్య, అశోక్ చంద్రారెడ్డి, నడిపి నాగన్న, వెంకట్, నాగటూరు సుధాకర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, గుండం గోపాల్‌రెడ్డి, పేరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఇనాయతుల్లా, మహేష్, సాధిక్, రమేష్, సీతారాముడు తదితరులు పాల్గొన్నారు.

అడవులను కాపాడుకుంటేనే మానవ మనుగడ

బండిఆత్మకూరు: అడవులను కాపాడుకుంటేనే మానవాళి మనుగడ సాధ్యమవుతుందని ఎఫ్ఆర్‌వో నాసిర్‌ఝా తెలిపారు. శనివారం బండిఆత్మకూరులోని అటవీ కార్యాలయంలో అడవుల సంరక్షణపై స్థానిక రాఘవేంద్ర పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. అడవుల శాతం తగ్గితే ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ అడవుల శాతం పెంచడానికి తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రోడ్డుకు ఇరువైపులా, ఖాళీ స్థలాల్లో మొక్కలను నాటి అవి పెరిగి పెద్దగయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆత్మకూరు ఎఫ్ఆర్‌ఓ పట్టాభి, రామకోటి, సుభాష్, పశువైద్యాధికారిణి అనూష, కరస్పాండెంట్ బిజ్జం సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఇంటింటికీ కుళాయి

జూపాడుబంగ్లా: జలజీవన్ మిషన్ కార్యక్రమంతో గ్రామాల్లోని ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఇవ్వనున్నట్లు తర్తూరు సర్పంచ్ పీఎం నాగిరెడ్డి, ఈఓపీఆర్డీ మణిమంజరి తెలిపారు. శనివారం తర్తూరు గ్రామంలో జలజీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రణాళికలు రూపొందించామని, త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి సంపత్‌కుమార్, సిబ్బంది అశోక్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఉగాదికి గృహ ప్రవేశాలు చేయించడమే లక్ష్యం



చిట్యాల వీధిలో లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న ప్రత్యేకాధికారి

ఆత్మకూరు: శ్రీశైలం నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోని జగనన్న కాలనీల్లో ఉగాదికి గృహప్రవేశాలను చేయించడమే ప్రభుత్వ లక్ష్యమని శ్రీశైలం నియోజకవర్గం ప్రత్యేకాధికారి పరమేశ్వరి, హౌసింగ్ పీడీ శేషుబాబు తెలిపారు. పట్టణంలోని హౌసింగ్ కార్యాలయంలో జగనన్న గృహాలపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఆత్మకూరు, వెలుగోడు, మహానంది, బండిఆత్మకూరు మండలాల్లో జగనన్న గృహాలను వేగంగా నిర్మించేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. ఇళ్లనిర్మాణం పై ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. అనంతరం పట్టణంలోని చిట్యాల వీధి, గంగబావి వీధిలో జగనన్న గృహాలపై లబ్ధిదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఇళ్లను నిర్మించుకునే లబ్ధిదారులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వెంటనే బిల్లులు చెల్లిస్తామని చెప్పారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ ఉమామహేశ్వరరావు, హౌసింగ్ ఏఈ ఉమామహేశ్వరరెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: లబ్ధిదారులతో చర్చించి గృహ నిర్మాణాలు వేగవంతం అయ్యేలా చేయాలని నియోజకవర్గ హౌసింగ్ స్పెషల్ ఆఫీసర్, భూగర్భ జలవనరులశాఖ డీడీ రఘురాం ఆదేశించారు. శనివారం జూపాడుబంగ్లా ఎంపీడీఓ కార్యాలయంలో గృహ నిర్మాణాలపై ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ, రెవెన్యూ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు ఎంత త్వరగా ఇళ్లు కట్టుకుంటే అంతేత్వరగా బిల్లులు మంజూరు చేస్తోందన్నారు. లబ్ధిదారులకు అవసరమైన ఇనుము, సిమెంటు తక్కువ ధరలకు ఇవ్వటంతో పాటు ఇసుకను ఉచితంగా ఇస్తున్నందున ఇళ్లు మంజూరైన వారు త్వరగా ఇళ్లు కట్టుకునేలా అవగాహన కల్పించాలన్నారు. బీఎల్, ఆర్ఎల్, ఆర్సీ స్థాయిల్లో ఉన్న లబ్ధిదారులు త్వరగా ఇళ్లు పూర్తిచేసుకునేలా చేయాలన్నారు. అస్సలు నిర్మాణాలు ప్రారంభించని వారికి ఇల్లు రద్దయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. ఉగాది పర్వదినం నాటికి ముఖ్యమంత్రి జగనన్నకాలనీల్లో ఇళ్లను ప్రారంభించనున్న నేపథ్యంలో మండలాల వారీగా ఇచ్చిన టార్గెట్లను సకాలంలో పూర్తిచేయాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పుల్లయ్యయాదవ్, హౌసింగ్ డీఈ ప్రభాకర్, ఈఓపీఆర్డీ మణిమంజరి, హౌసింగ్ ఏఈ శ్రీనాథ్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

కమ్మవారి సత్రం నిర్మాణానికి శంకుస్థాపన



స్థలదాతలను సన్మానిస్తున్న అధ్యక్షుడు, అతిథులు

మహానంది: మహానందీశ్వరస్వామి ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సేవలు అందిస్తామని మహానంది క్షేత్ర కమ్మవారి నిత్యాన్నదానసత్రం, సేవాసదనం అధ్యక్షుడు వెంకటకృష్ణారావు తెలిపారు. మహానందిలో కమ్మవారి అన్నదానసత్ర భవనం, గదుల నిర్మాణానికి శనివారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. వెంకటకృష్ణారావు మాట్లాడుతూ రూ.6 కోట్లతో 38 రూములు, కల్యాణమండపం, అన్నదాన భవనం నిర్మిస్తామన్నారు. ఇప్పటి వరకు 27 మంది దాతలు ఒక్కొక్కరు రూ.8లక్షల చొప్పున విరాళం అందించారని చెప్పారు. అనంతరం స్థలదాత సీతారామయ్యను సత్కరించారు. కార్యక్రమంలో సెక్రటరీ చిలుకూరు రవిబాబు, ట్రెజరర్ కోగంటి సాంబశివరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ వేమసాని శ్రీనివాసరావు, మహానంది దేవస్థానం మాజీ చైర్మన్ కంచర్ల సురేష్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

మాకు ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేదు

కమ్మవారిపై పలురకాలుగా కామెంట్స్ చేస్తే సహించమని, మాకు ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేదని ఆంధ్రప్రదేశ్ కాకతీయ సేవా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెజవాడ వెంకట్రావు తెలిపారు. మహానందిలో శనివారం నిర్వహించిన సమావేశంలో వెంకట్రావు మాట్లాడుతూ కేవలం కమ్యూనిటీ కోసమే పని చేస్తున్నామని చెప్పారు. కమ్మవారి కమ్యూనిటీలో పేదరికంలో ఉండి చదువును ఆపుకోవడానికి వీలు లేకుండా ఎల్లప్పుడూ పేదవిద్యార్థుల కోసం ముందుంటామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా వంద హాస్టళ్ల నిర్మించేందుకు అన్ని ప్రణాళికలు పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి చక్రవర్తి, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు శివన్నారాయణ చౌదరి, జాయింట్ సెక్రటరీ తమ్మినేని రమేష్‌బాబు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో సౌకర్యాలు కల్పిస్తాం



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ ఆసియా మారూఫ్

ఆత్మకూరు: పట్టణంలోని నిరుపేదలు నిర్మించుకుంటున్న జగనన్న కాలనీల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, డీఈ ఉమామహేశ్వరరావు అన్నారు. పట్టణంలోని జగద్గురు మఠంలో మున్సిపాలిటీ పరిధిలోని వలంటీర్ల సమావేశం నిర్వహించారు. చైర్ పర్సన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సహకారంతో నియోజకవర్గం అభివృద్ధి పథంలో పయనిస్తోందన్నారు. నిరుపేదల సొంతింటి కల నెరవేర్చేలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు. జగనన్న కాలనీల్లో తాగునీటి సౌకర్యం, డ్రైనేజీ కాల్వలు, సీసీరోడ్లు, వీధి దీపాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్లను నిర్మించుకోవాలని కోరారు. హౌసింగ్ ఏఈ ఉమామహేశ్వరరెడ్డి, మెప్మా సీఈఓ భారతి, హౌసింగ్ ప్రత్యేకాధికారి శ్యామల తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ నిజాయితీ



ఎస్‌ఐ ఎన్‌వీ రమణ సమక్షంలో బాధితురాలికి సెల్‌ఫోన్, పర్సు అందజేస్తున్న ఆటో డ్రైవర్ సంపత్

జూపాడుబంగ్లా: ఆటోలో మరచిపోయిన రూ.4,500 నగదు, సెల్‌ఫోన్‌ను పోలీసుల అధ్వర్యంలో బాధితురాలికి అందజేసి ఆటో డ్రైవర్ నిజాయితీ చాటుకున్న సంఘటన శనివారం నందికొట్కూరు పట్టణంలో చోటుచేసుకుంది. నందికొట్కూరు పట్టణ ఎస్‌ఐ ఎన్‌వీ రమణ తెలిపిన వివరాల మేరకు బ్రాహ్మణకొట్కూరు గ్రామానికి చెందిన సంజమ్మ నందికొట్కూరుకు వచ్చేందుకు ఆటో ఎక్కింది. దిగే సమయంలో పర్సును మరచిపోయింది. కొద్దిసేపు తర్వాత గుర్తించి పోలీసులను ఆశ్రయించింది. వెంటనే స్పందించిన ఎస్‌ఐ ఎన్‌వీ రమణ సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించి పోలీసు నంబర్ ఆధారంగా ఆటోను గుర్తించారు. అయితే అప్పటికే ఆటో డ్రైవర్ పర్సును బాధితురాలికి ఇచ్చేందుకు బస్టాండు వద్ద వేచిచూస్తున్నాడు. ఈలోగా పోలీసులు అతన్ని గుర్తించటంతో ఏబీఎం పాలెంకు చెందిన ఆటో డ్రైవర్ సంపత్ ఎస్‌ఐ సమక్షంలో బాధితురాలికి పర్సు, అందులో ఉన్న సెల్‌ఫోన్, రూ.4,500ల నగదును అప్పగించాడు. నిజాయితీ చాటుకొన్న ఆటో డ్రైవర్ సంపత్‌ను ఎస్‌ఐ అభినందించారు.

శ్రీశైల క్షేత్రం అత్యంత శక్తివంతమైనది



ప్రవచనాలు వినిపిస్తున్న షణ్ముఖ శర్మ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రం అత్యంత శక్తివంతమైనదని ప్రముఖ ప్రవచకులు బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ తెలిపారు. హిందూ ధర్మప్రచారంలో భాగంగా శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న శివనామ మహిమ ప్రవచనాలు కార్యక్రమంలో భాగంగా ఆయన రెండో రోజు శనివారం ప్రవచనాలు కొనసాగించారు. నామజపం, మంత్ర జపాలను శ్రీశైలక్షేత్రంలో చేస్తే అధిక ఫలం లభిస్తుందన్నారు. రుద్రనామ జపం చేయడం వలన అన్ని గ్రహదోషాలు తొలగిపోతాయని చెప్పారు. కార్యక్రమంలో దేవస్థాన ఈఓ ఎస్ లవన్న దంపతులు, ఆలయాధికారులు పర్యవేక్షకులు పాల్గొన్నారు.

మేల్కొనకపోతే రాయలసీమకు అన్యాయమే

పగిడ్యాల: అనాదిగా రాయలసీమ ప్రాంతవాసులు అన్యాయానికి గురవుతున్నారని, మేల్కోకపోతే ఈ ప్రాంతం ఎడారిగా మారుతుందని రాయలసీమ అభివృద్ధి కమిటీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలం సంగమేశ్వరం వద్ద రాయలసీమ ప్రజా ప్రదర్శన కార్యక్రమం చేపట్టారు. సిద్దేశ్వరం నుంచి పాదయాత్రగా బయలుదేరిన బైరెడ్డి మధ్యాహ్నం 2.40 గంటలకు సంగమేశ్వరం చేరుకున్నారు. అనంతరం కార్యకర్తలనుద్దేశించి ఆయన మాట్లాడుతూ సప్తనదుల సంగమేశ్వరం వద్ద ఉన్న నీళ్లను చూడటమే కానీ పొలాలకు ఉపయోగించుకోలేని పరిస్థితులు ఏర్పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. సంగమేశ్వరం వద్ద తీగల వంతెన కాకుండా బ్యారేజ్ కమ్ డ్యాంను నిర్మించాలని.. తీగల వంతెన వల్ల రాయలసీమకు ఉపయోగం లేదని భవిష్యత్‌లో శ్రీశైలం డ్యాంలో చెంబెడు నీళ్లు నిల్వ ఉండని పరిస్థితి నెలకొంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి, తిరుపతి నవీన్‌కుమార్‌రెడ్డి, సోషల్ మీడియా ఫోరం రాలయసీమ అధ్యక్షులు అశోక్‌వర్ధన్, నంద్యాల వేణుగోపాల్‌రెడ్డి, చిత్తూరు రామచంద్రయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి



కిట్లను పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పాములపాడు: చదువుతో పాటు క్రీడల్లో రాణించటం వల్ల సులభంగా గుర్తింపు పొందవచ్చని మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు రామలింగేశ్వరరెడ్డి తెలిపారు. శనివారం ఆయన తుమ్మలూరు గ్రామంలో క్రీడాకారులకు క్రికెట్ కిట్టును అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వరప్రసాదు, కార్యదర్శి పుల్లయ్య, వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా స్వాధీనం

జూపాడుబంగ్లా: నందికొట్కూరు పట్టణంలోని మిడుతూరు రోడ్డులో శనివారం వాహనాలను తనిఖీ చేస్తుండగా పట్టణంలోని శికారిపేటకు చెందిన శికారి గోపాల్, సుగుణమ్మ ద్విచక్రవాహనంపై 50 ఆఫ్ లీటర్ బాటిళ్లలో నాటుసారా తరలిస్తూ పట్టుబడ్డారని పట్టణ ఎస్‌ఐ ఎన్‌వీ రమణ తెలిపారు. నాటుసారా, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకొని నిందితులను అదుపులోకి తీసుకున్నారు. కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

వంట ఏజెన్సీని రద్దు చేయాలి

మిడుతూరు: ఏపీ ఆదర్శ బాలికల వసతిగృహంలో నాణ్యమైన, రుచికరంగా లేని భోజనం వడ్డిస్తున్న వంట ఏజెన్సీని రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మహానంది డిమాండ్ చేశారు. శనివారం ఆదర్శ పాఠశాల బాలికల వసతి గృహంలో మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. వారు మాట్లాడుతూ.. వసతి గృహంలో 50 మంది విద్యార్థినులు ఉన్నారని, వారికి సరైన ఆహారం అందడం లేదన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ తాలూకా నాయకులు దినేష్, వినోద్ పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సోషల్ ఆడిట్

జూపాడుబంగ్లా: 2021 జులై 01 నుంచి 2022 మార్చి 31 వరకు జూపాడుబంగ్లా మండలంలో జరిగిన జాతీయ ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ ప్రారంభమైనట్లు ఎంపీడీఓ మంజులవాణి, ఏపీఓ గౌరీబాయి శనివారం తెలిపారు. జాబ్‌కార్డు వారిగా, వర్క్‌ఐడీ వారీగా సామాజిక తనిఖీ బృందం సభ్యులు లబ్ధిదారులను విచారించటంతో పాటు పనులను పరిశీలించి, వాటి కొలతలు, సమగ్రవివరాలు సేకరిస్తారని తెలిపారు. అందుకు గ్రామాల్లోని ఫీల్డ్ అసిస్టెంట్లు, సీనియర్ మేట్లు సహకరించాలని కోరారు.

విజయ డెయిరీ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

వెలుగోడు/శ్రీశైలంప్రాజెక్ట్/ఆత్మకూరు: తొలగించిన విజయ పాల డెయిరీ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వి.యేసురత్నం డిమాండు చేశారు. కార్మికుల తొలగింపును నిరసిస్తూ శనివారం సీఐటీయూ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. యేసు రత్నం మాట్లాడుతూ.. ఉమ్మడి కర్నూలు జిల్లాలో విజయ పాల డెయిరీలో 20 సంవత్సరాలుగా పనులు చేస్తున్న కార్మికులను యాజమాన్యం అక్రమంగా తొలగించిందన్నారు. అలాగే శ్రీశైలంలో సీఐటీయూ నాయకులు మారెన్న , దర్శనం నాగరాజు, ఆత్మకూరులో సీఐటీయూ జిల్లా నాయకులు రణధీర్, పట్టన కార్యదర్శి రామ్‌నాయక్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆయా మండలాల తహసీల్దార్లుకు వినతిపత్రాలు సమర్పించారు. కార్యక్రమాల్లో సీఐటీయూ, ఏపీ రైతు సంఘం నాయకులు నాగేంద్రుడు, రామాంజనేయులు, మహమ్మద్ రఫి, సురేంద్ర, భాస్కర్, అతావుల్లా తదితరులు పాల్గొన్నారు.

బీసీలు అన్ని రంగాల్లో రాణించాలి

మహానంది: అన్ని రంగాల్లో బీసీలు రాణించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నట్లు చిత్తూరు జిల్లా పుంగనూరుకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త రామచంద్ర యాదవ్ అన్నారు. ప్రస్తుత రాజకీయ పార్టీలు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను పట్టించుకోవడం లేదని, కేవలం ఓటుబ్యాంకుగా పరిగణిస్తున్నాయని విమర్శించారు. చలో సిద్ధేశ్వరం కార్యక్రమానికి వచ్చిన ఆయన శనివారం రాత్రి మహానందీశ్వరుడిని దర్శించుకున్నారు. శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామివార్లను దర్శించుకున్న అనంతరం ఆయన మాట్లాడుతూ త్వరలో బీసీల అభివృద్ధే ధ్యేయంగా కొత్త పార్టీ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఆయన వెంట మండల బీసీ సంఘం నాయకులు గోపవరం మాజీ సర్పంచ్ సీహెచ్ రాముడు, క్రాంతి కుమార్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రథసప్తమి వేడుకలు



రథసప్తమి పూజల్లో పాల్గొన్న శ్రీశైలం దేవస్థాన ఈఓ లవన్న ,



రథోత్సవంలో నందికొట్కూరు మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి తదితరులు



మహానందిలో రథసప్తమి పూజలు చేస్తున్న దృశ్యం



నందికొట్కూరులో భక్తులకు దర్శనమిస్తున్న సూర్యభగవానుడు

మహానంది: మహానంది క్షేత్రంలో శనివారం రథసప్తమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా పాలమహేశ్వర్‌రెడ్డి, ఏఈఓ ఎర్రమల మధు ఆధ్వర్యంలో ఆలయ ప్రధానార్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, వేదపండితులు రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, శాంతారాం భట్‌లు విశేష పూజలు చేపట్టారు. స్థానిక రథమండపం వద్ద అందరూ ఆరోగ్యంగా ఉండాలని పూజలు జరిపారు. అందులో భాగంగా సూర్యభగవానుడికి ప్రీతికరమైన అర్ఘ్య ప్రధానములు, త్రిచ, మహాసౌర హోమం, సూర్య నమస్కారాలు చేశారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల కోసం రథోత్సవాన్ని సిద్ధం చేసే ప్రక్రియలో భాగంగా రథదేవతలకు ఆవాహనాది, ఉపచార పూజలు శాస్త్రోక్తంగా చేపట్టారు. పూజా కార్యక్రమాల్లో ట్రస్ట్‌బోర్డు మెంబర్లు బండి హేమలత, గంగిశెట్టి మల్లికార్జునరావు, వీరభద్రుడు, సూపరింటెండెంట్లు ఓంకారం వెంకటేశ్వరుడు, అంబటి శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు. అలాగే గాజులపల్లె రైల్వేస్టేషన్ గ్రామంలోని శ్రీ గంగా, గౌరీ సమేత మరకత లింగేశ్వర, నవగ్రహ ఆలయంలో రథసప్తమి సందర్భంగా ఆలయ వ్యవస్థాపకులు కనమర్లపూడి మస్తాన్‌రావు ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు.

శ్రీశైలంలో సూర్యారాధన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలాలయంలో రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం అమ్మవారి యాగశాలలో సూర్యారాధన కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా ఆలయార్చకులు వేదపండితులు లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. అనంతరం కలశ స్థాపన చేసి కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతి పూజ జరిపించారు. వైదికాచార్యులు ఆయా బీజ మంత్రాలతో, ప్రత్యేక ముద్రలతో సూర్యనమస్కారాలు చేశారు. కార్యక్రమంలో భాగంగా సూర్యయంత్రపూజ, వేదపారాయణాలు ,అరుణపారాయణం జరిపించారు. అనంతరం సూర్యభగవానుడికి ఉత్తరపూజలు (షోడశోపచార పూజలు), నివేదన, మంత్రపుష్పము నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీశైలదేవస్థాన కార్యనిర్వాహణాధికారి ఎస్‌లవన్న పాల్గొని సూర్య నమస్కారాలు చేశారు.

జూపాడుబంగ్లా: సూర్యభగవానుడి జయంతిని పురస్కరించుకొని శనివారం రథసప్తమి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నందికొట్కూరు పట్టణంలోని కోటవీధిలో ఉన్న సూర్యభగవానుని ఆలయంలో తెల్లవారుజాము నుంచే అర్చకులు స్వామి వారికి పంచామృతాభిషేకం నిర్వహించి, పన్నీటి స్నానం చేయించి, పట్టువస్త్రాలతో అలంకరించారు. అనంతరం కుంకుమార్చన, పుష్పార్చన హోమాధి కార్యక్రమాలతో స్వామివారికి విశేషపూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి కల్యాణాన్ని కనుల పండువగా జరిపించారు. సాయంత్రం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన రథంలో పట్టణంలోని ప్రధానవీధుల్లో తిప్పారు. వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.